



మోమిన్‌పేట్: వెల్చాల్‌లో బడిబాటలో ఉపాధ్యాయులు

తొలిరోజు పండుగలా..



బొంరాస్‌పేట్: కొత్తూర్‌లో విద్యార్థులపై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



పునఃప్రారంభమైన స్కూళ్లు

విద్యార్థుల హాజరు అంతంతే..

జిల్లా వ్యాప్తంగా 28వేల మంది హాజరు

కొత్తగా 1,420 అడ్మిషన్లు

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బడి గంట మోగింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున: ప్రారంభమైన తొలి రోజు పండగ వాతావరణం కనిపించింది. పాఠశాలల్లో మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. కాగా, గురువారం పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని పాఠశాలు అరకొర మంది విద్యార్థులతో బోసిపోయాయి. జిల్లాలో గురువారం 28 వేల మంది వరకు విద్యార్థులు హాజరైనట్లు అంచనా. హాజరైన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. బొంరాస్‌పేట్ మండలం, కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కాగా, పాఠశాలలు ప్రారంభించే తొలిరోజు నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు కొన్ని పాఠశాలల్లో అమలుకు నోచుకోలేదు. అలాగే విద్యార్థుల చేరికలు సైతం అంతంత మాత్రంగానే జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 1,420 మంది చేరినట్లు సమాచారం.



పరిగి: దాడితండా పాఠశాలలో..



శామీర్‌పేట: లాల్‌గడి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో విజయకుమారి



ఘట్‌కేసర్ జెడ్పీ బాలికల పాఠశాలలో పుస్తకాలతో విద్యార్థులు



పెద్దేముల్: ప్రాథమిక పాఠశాలలో స్వాగత తోరణం

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి(2017- ఐఏఎస్)ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరుకు చెందిన మను చౌదరి సివిల్స్‌లో తొలి ప్రయత్నంలోనే 2017లో ఆలిండియా 36వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా నుంచి మేడ్చల్ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. గతంలో నాగర్‌కర్నూల్, కామారెడ్డి జిల్లాలకు అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గౌతమ్ పోత్రు సింగరేణి బొగ్గు గనుల సంస్థ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన 2023 అక్టోబర్ 13న అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 నెలల పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జిల్లాలో సాఫీగా జరుగడంలో కీలకంగా పనిచేశారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం

» రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ గతంతో పోలిస్తే గ్రామస్థాయిలో బలోపేతమైందని, నిరంతరం ప్రజల సంక్షేమానికి పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలో 11 ఏళ్ల నరేంద్రమోదీ పాలనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ 11 ఏళ్ల పాలన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్‌కు ఎంత వ్యతిరేకత వచ్చిందో ఇప్పుడు కొద్దికాలంలోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్టీలో కొత్తవారికి పార్టీ సిద్ధాంతాలు తెలుసుకునేందుకు సమయం పడుతుందని వారికి మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రమ శిక్షణ విషయంలో పార్టీ కఠినంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సదానందరెడ్డి, శ్రీధర్, నరోత్తంరెడ్డి, వివేకానందారెడ్డి, శిరీష, బస్వలింగం, సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి మొదలైంది. సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడంతో సందడి ప్రారంభమైంది. 15న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థలకు పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పడకేసింది. కనీసం గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ వాయిదాలు కూడా కట్టలేని దయనీయ పరిస్థితులు పలు పంచాయతీల్లో నెలకొన్నాయి.



స్థానిక సందడి!

మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి

ఎన్నికల సిబ్బంది వారే ఉన్నారా? ఎవరైనా మారారా?

టీ-పోల్ పోర్టల్‌లో పోలింగ్ కేంద్రాల వివరాలు నమోదు


650 మందికి ఒక పోలింగ్ కేంద్రం

రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు?

పంచాయతీలు	594
వార్డులు	5,058
పోలింగ్ కేంద్రాలు	5,058
జెడ్పీటీసీలు	20
ఎంపీటీసీలు	229
పోలింగ్ కేంద్రాలు	1,288

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికలు సకాలంలో జరగకపోవడంతో నిధులు లేక పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన మాట అటుంచి కనీసం పారిశుధ్యం పనులు కూడా సక్రమంగా కొనసాగడం లేదు. అలాగే పంచాయతీ కార్మికులకు నెలనెలా సక్రమంగా వేతనాలు కూడా అందడం లేదు. సర్పంచులు లేకపోవడంతో అజమాయిషీ కొరవడింది. పేరుకే ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోందే తప్ప తాము ప్రాతినిధ్యం వహించే పంచాయతీల పరిస్థితి ఏ విధంగా ఉందనేది ప్రత్యక్షంగా పరిశీలించిన సందర్భాలూ తక్కువే. పాలక వర్గాలు లేక స్థానిక

మిగతా 8వ పేజీలో...



టీ-పోల్‌లో వివరాల నమోదు

ఇది వరకు సమగ్ర సమాచారం సిద్ధం చేసుకున్న అధికారులకు ఇటీవల ఉన్నతాధికారుల నుంచి మరోసారి ఆదేశాలు వచ్చాయి. ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే సవరించుకుని టీ-పోల్ పోర్టల్‌లో ఆ వివరాలన్నీ నమోదు చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేయడంతో మరోసారి మార్పులు, చేర్పులపై అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా ఎన్నికల విధుల కోసం గతంలో సిద్ధం చేసిన ఉద్యోగులే ఉన్నారా? కొత్త వారెవరైనా వచ్చారా? కొత్త ఉద్యోగులు ఎవరైనా వస్తే వారి వివరాలు సేకరించి టీ-పోల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశాలు రాగా, సంబంధిత అధికారులు కొత్త ఉద్యోగుల వివరాలు సేకరించి టీ-పోల్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన యూపీ స్పీకర్

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీశ్ మహానా గురువారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన మహానా దంపతులు హైదరాబాద్‌లోని ప్రసాద్‌కుమార్ నివాసానికి రాగా వారిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి మెమొంటో బహూకరించారు.

'మేడ్చల్'లో 68శాతం రేషన్ పంపిణీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సుగుణాబాయి

మేడ్చల్, జూన్12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 68 శాతం రేషన్ పంపిణీ పూర్తయినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణాబాయి తెలిపారు. గురువారం ఆమె జిల్లాలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ ఈ నెల చివరి వరకు కొనసాగుతుందన్నారు. 3 నెలల స్టాక్ అందుబాటులో ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్డుదారులు రేషన్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సాక్షి వద్దకే న్యాయమూర్తి!



ఆటోలో ఉన్న వృద్ధుడి నుంచి సాక్ష్యం రికార్డు చేస్తున్న జడ్జి శ్రీరామ్

కొడంగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా కోర్టు హాల్లోకి రాలేని ఓ సాక్షి వద్దకు జడ్జి వచ్చి సాక్ష్యాన్ని రికార్డు చేసుకున్నారు. ఈ ఘటన గురువారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో చోటు చేసుకుంది. ఏడేళ్ల క్రితం ఓ కేసులో సాక్షిగా ఉన్న చిన్ననందిగామకు చెందిన చాకలి అంజిలప్ప కోర్టుకు హాజరై అనారోగ్యం కారణంగా ఆటోలోనే కూర్చున్నాడు. పరిస్థితిని తెలుసుకున్న న్యాయమూర్తి శ్రీరామ్ కోర్టుహాల్ నుంచి బయటకొచ్చి ఆటోలోని అంజిలప్ప నుంచి సాక్ష్యాన్ని రికార్డు చేశారు. ఆయన వెంట పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబినయ్ ఉన్నారు.



కోట్‌పల్లి: బార్వాద్‌లో కురుస్తున్న వర్షం (ఇన్‌సెట్‌లో) పరిగి: హరిజనవాడ స్కూల్లో వరద నీరు

దంచికొట్టిన వాన

పలు చోట్ల పిడుగులు.. ఉరుములు మెరుపులతో వర్షం

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి గురువారం తెల్లవారు జాము వరకు జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. వాగుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. గురువారం ఉదయం 8 గంటల వరకు అత్యధికంగా వికారాబాద్ మండలంలో 61.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పరిగిలో 58.0 మి.మీ., పూడూరులో 57.5 మి.మీ., కొడంగల్, బొంరాస్‌పేట్‌లో 45.5 మి.మీ., చౌడాపూర్‌లో 43.3 మి.మీ., ధారూరులో 38.5 మి.మీ., కాగా, గురువారం రాత్రి 7 గంటల వరకు కురిసిన వర్షానికి పెద్దేముల్ మండలంలో 47.3 మి.మీ.వర్షం కురియగా, దుద్యాల్‌లో 37.5 మి.మీ., దోమలో 25.3మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

» జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసున్న డీఈవో రేణుకాదేవి

బంట్వారం జూన్12 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని బోపునారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందనన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తోందన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. తప్పనిసరిగా తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్ నోట్ పుస్తకాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు విక్రమ్ రెడ్డి, అంజమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు గ్యాస్ ఏజెన్సీలు



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి నాగార్జున

ధారూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా పెట్రోల్ పంపులు, గ్యాస్ ఏజెన్సీలు నడుపుకోవచ్చని జిల్లా సహకార అధికారి నాగార్జున తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా గురువారం ధారూరు సహకార సంఘం కార్యాలయంలో సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ ధరలో మందులు లభించే జనరిక్ ఔషధ దుకాణాలను సంఘాలు నడుపుకోవచ్చన్నారు. ధారూరు సహకార సంఘాన్ని నాబార్డు వారు ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌గా ఎంపిక చేసిందన్నారు. దీని ద్వారా ఒక్కో సభ్యుడు రూ.2 వేల చొప్పున సంఘంలోని 750 మంది సభ్యులు రూ.15లక్షలు వాటా ధనం చెల్లిస్తే ఎన్‌సీడీసీ రూ.15లక్షలు గ్రాంటుగా ఇస్తుందని తెలిపారు. ఈ నిధులతో ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి, నాబార్డు డీడీఎం అఖిల్ పూనా, డీసీవో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విక్రమ్, జేఐ మహిమూద్ అలీ, ధారూరు కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ పరీన్ ఫాతీమా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అభివృద్ధి అభినందనీయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల మోడల్ స్కూల్‌లో డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు బాగా చదువుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో అమెజాన్ కంపెనీ నిర్వాహకులు నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్, స్పోర్ట్స్ పరికరాలు, పాఠశాలకు రంగులు వేయడం వంటి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమెజన్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మోడల్ స్కూల్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయం అన్నారు. అలాగే చేవెళ్లలోని కేజీవీబీ, నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సైతం అభివృద్ధి చేయాలని కంపెనీ నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంఈవో పురందాస్, ఇంటర్‌బోర్డు డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండు, జె.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు కృష్ణారెడ్డి, వసంతం, రాములు, జహంగీర్, కాంగ్రెస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అమెజాన్ కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలి

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



కలెక్టరేట్ ఎదుట జుంటుపల్లి రైతులతో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నేత ఎస్.శుభప్రద్ పటేల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వడ్ల బస్తాకు 41 కిలోలు కాంటా పెట్టడానికి బదులు 43 కిలోలు కాంటా పెడుతున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లు సైతం 50 బస్తాలు ఉన్న రైతు దగ్గర రెండు బస్తాలు, 70 బస్తాలు ఉంటే మూడు బస్తాలు, 100 బస్తాలకు 5 బస్తాలు, 150 బస్తాలకు 8 బస్తాలు ధాన్యం తగ్గిస్తున్నారన్నారు. గురువారం యాలాల మండలం జుంటుపల్లి రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ధాన్యం విక్రయాల్లో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ రైతులతో మాట్లాడి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు రాంచందర్, శాంతప్ప, గోవర్ధన్‌గౌడ్, ఎండీ సోను, గోవింద్, బీఆర్ఎస్ నాయకులు రవిశంకర్, సిద్ధిఖ్ పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అజయ్‌ప్రసాద్, తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'రోడ్డిలా.. ప్రయాణమెలా' అంటూ ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రధాన బీటీ రోడ్డు గుంతలు పడి వర్షపు నీరు నిలిచి మడుగుగా తయారైంది. ఈ విషయాన్ని నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు బాగుకు చర్యలు తీసుకోవాలని సూచించడంతో అజయ్‌ప్రసాద్ బ్లాక్ కంకర, డస్ట్ తెప్పించి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయించారు. ఎట్టకేలకు గుంతల పూడ్చివేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మెంబర్ అనూప్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలి

పెరుమాండ్లకుంటలో మురుగు కలువడంపై హైకోర్టు ఉత్తర్వులు

ఘట్‌కేసర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో పెరుమాండ్లకుంటలో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు చేపట్టక పోవడంతో యువ న్యాయవాది చెరుకు భరద్వాజ్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గురువారం కోర్టు విచారణ జరిపి నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయవాది భరద్వాజ్‌తోపాటు స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగువన పెద్దఎత్తున నిర్మించిన బహుళ అంతస్తుల నుంచి పెద్దఎత్తున వెలువడుతున్న మురుగును దిగువన ఉన్న పెరుమాండ్లకుంటలోకి వదిలి పెడుతుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవడమే కాకుండా పరిసరాలు తీవ్ర దుర్గంధ భరితంగా మారయని వాపోయారు. ఈ చెరువు పక్కనే ఉన్న శ్రీసర్వ మంగళాసమేత స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలుగుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా ఇన్ఫోసీస్ ఐటీ పరిశ్రమ పక్కన నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల యాజమానులు మురుగు నీటి శుద్ధి ప్లాంట్(ఎస్టీపీ) నిర్మించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ధారూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): ధారూరులోని ఫర్టిలైజర్ దుకాణంలో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతిలేని పత్తి విత్తనాలు, క్రిమిసంహారక మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. స్టాక్ నిల్వ, అమ్మకాల వివరాల లెక్కలు సరిగా లేవని తేల్చారు. ఆ వివరాలను మండల ఏవో సూర్యప్రకాష్‌కు అప్పగించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధారూరులోని తుల్జాభవాని ఎరువుల, విత్తన విక్రయ దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మధన్‌మోహన్ రెడ్డి, తహసీల్దార్ గంగాప్రసాద్ తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలను గుర్తించారు. క్రిమిసంహారక మందులకు సంబంధించి ఎనిమిది బ్రాండ్లు అనుమతులు లేకుండా అమ్ముతున్నట్లు గుర్తించారు. తనిఖీలు జరుగుతున్న సమాచారం అందుకున్న ఇతర ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తమ దుకాణాలను మూసివేశారు. దీంతో అధికారులు ఒకే దుకాణాన్ని తనిఖీ చేసి వెళ్లిపోయారు. తర్వాత మూసివేసిన దుకాణాలను యజమానులు తెరిచి వ్యాపారం కొనసాగించడం విశేషం.

హాజరుకు బయోమెట్రిక్ తప్పనిసరి

తాండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఫెస్టియల్ రికగ్నిషన్ గుర్తింపు హాజరును అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16లోపు ఎంపీపీ, జడ్పీ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు పరికరాలను ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూలై 1 నుంచి ఈ విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ముఖ్య కార్య నిర్వహణ అధికారులకు ఆదేశాలు అందాయి. పారదర్శకత, క్రమశిక్షణ ఉండడానికి ఈ విధానం అమలు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలలో డీఎస్ఆర్ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు తిరస్కరిస్తున్న విషయం విధితమే. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఈ విధానం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని మండల పరిషత్ కార్యాలయ అధికారులు పెదవి విరుస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో 20 మండల పరిషత్, ఒక జిల్లా పరిషత్ ఉంది. మండల పరిషత్‌లో ఎంపీడీఓ, సూపరింటెండెంట్, ఎంపీఓ, ఏఈ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ విధానం అమలు చేస్తే ఎంపీపీ, జడ్పీ అధికారులు ఆందోళన బాట పట్టే అవకాశాలున్నాయి.

డీజిల్‌కు డబ్బుల్లేవు.. ట్రాక్టర్లు నడుపలేం



ఎంపీడీవోకు ట్రాక్టర్ల తాళాలను అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ధారూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో డీజిల్‌కు డబ్బులు లేవని, ట్రాక్టర్లను నడపలేకపోతున్నామని ట్రాక్టర్ల తాళాలను గురువారం ఎంపీడీవో నర్సింహులకు పంచాయతీ కార్యదర్శులు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు మెమోరాండం అందించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదన్నారు. పంచాయతీల్లో వివిధ పనుల కోసం తమ వేతనాలను ఖర్చు చేస్తున్నామని, అప్పులు తెచ్చి ట్రాక్టర్లకు డీజిల్ పోయించి నడిపించామని వాపోయారు. ఇక పంచాయతీల నిర్వహణ భారం తమ వల్ల కాదని, ఆర్థిక పరమైన విధులను బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు సంజీవ్, రామ్‌విహార్, మండల శాఖ అధ్యక్షుడు ఆరీఫ్ ఖాన్, ఉపాధ్యక్షురాలు సుమలత పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ వికారాబాద్ యందు ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కే రామాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిలాసఫీ సోషియాలజీ, సైకాలజీ, తెలుగు, ఆంగ్లం లో 2 చొప్పున ఖాళీలు, గణితం పెడగాగి, సైన్స్ అండ్ పెడగాగి, సోషల్ సైన్స్ పెడగాగి, వ్యాయామ విద్యా, విజువల్ ఆర్ట్స్ పెర్ఫామింగ్ ఆర్ట్స్ అలాగే ఉర్దూలో ఫిలాసఫీ/ సోషియాలజీ, ఉర్దూ లాంగ్వేజ్, మ్యాథ్స్ పెడగాగి, సైన్స్ పెడగాగి, సోషల్ పెడగాగికి సంబంధించిన పోస్టులకు నేటి నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకులు 65 ఏళ్లకు మించకూడదని, నిరుద్యోగ అభ్యర్థులు తగిన సబ్జెక్టులో పీజీ, ఎంఎడ్ వారు అర్హులన్నారు. మిగతా వివరాలకు 9441071533 నంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

బీటీ రోడ్డు మంజూరు
చేయాలని వినతి

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దయ్యాలబోడు తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని తండా గిరిజనులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి తండా నాయకులు వినతిపత్రం అందజేశారు. మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డు నుంచి అర కిలోమీటర్ బీటీ నిర్మిస్తే తమ తండాకు సౌకర్యంగా ఉంటుందని వినతి పత్రం లో పేర్కొన్నారు. నాయకులు రాజు, చంద్రునాయక్, మండ్లీ రాములు, విజయ్, విజయ్‌రాథోడ్, నవీన్, శ్రీను, రాజేశ్, కమ్లీ ఉన్నారు.

మోదీ పాలనలో
అద్భుత విజయాలు

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కాల లక్ష్మణ్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన మోదీ 11 ఏళ్ల పాలనపై వికసిత్ భారత్ అమృత్ కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా పురోగమించడానికి ప్రజలంతా బీజేపీ ప్రభుత్వంతో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాంపాల్ నాయక్, దుర్గయ్య, రవిరాథోడ్, పద్మప్రశాంత్, ప్రవీన్‌రెడ్డి తదితరులున్నారు.

నాటక రంగాన్ని
కాపాడుకుందాం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హిందూ సాంప్రదాయం, సంస్కృతికి అద్దం పడుతున్న నాటక రంగాన్ని బతికిస్తూ, భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశన్న పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం, పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మదాయశాఖ సౌజన్యంతో రంగక్షేత్ర, రంగస్థల కళల శిక్షణాలయం, నటమండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నాటకానికి డి. కాశన్న హాజరై మాట్లాడారు. శ్రీ గేజేశ్వర నాట్య కళా మండలి కళాకారులు అద్భుతంగా శ్రీకృష్ణ రాయబారం నాటకాన్ని ప్రదర్శించారని అభినందించారు. ప్రతీ పౌర్ణమి రాత్రి ఒక కళా బృందానికి అవకాశం ఇస్తూ, నాటక ప్రదర్శనలను కొనసాగిస్తున్నట్లు రంగక్షేత్ర నట శిక్షణాలయం-నట మండలి అధ్యక్షుడు జెఎస్వీ శివ ప్రసాద్ తెలిపారు. నాటక ప్రదర్శనను భక్తులు తిలకించి, అభినందించారు.

నూతన విద్యావిధానంతో అద్భుత ఫలితాలు

- భారత ప్రభుత్వ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారాం
- శంకర్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో అంతర్జాతీయ విద్యావిధానంపై సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారాం

శంకర్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలో జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టిన నాలుగేళ్లలో ఉన్నతమైన ఫలితాలను సాధిస్తుందని భారత ప్రభుత్వ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారాం తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యావిధానం 2020పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా సీతారం, విశిష్ట అతిథిగా మణిపాల్ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్స్‌లర్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ వెంకటేష్, ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్. గణేశ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో పాఠశాల, ఉన్నత విద్యావ్యవస్థలో పరివర్తన, సంస్కరణలకు మార్గం సుగమం చేస్తూ జాతీయ విద్యావిధానం 2020లో ప్రవేశపెట్టబడిందన్నారు. 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా ప్రతీ విద్యార్థి ప్రత్యేక సామర్థ్యాలను సరళంగా, బహుళ విధాలుగా బయటకు తీసుకురావడం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రపంచంలోనే జ్ఞాన రంగంలో సూపర్‌గా మార్చడంలో నూతన విద్యావిధానం నిమగ్నమై సఫలీకృతమవుతోందన్నారు. 2047 సంవత్సరానికి ప్రధాన మంత్రి ఆశించినట్లుగా ప్రపంచంలోనే దేశ జీడిపిలో ఉన్నతమైన ఫలితాలను సాధించి అగ్రస్థానాన్ని ఆక్రమిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో హైదరారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బీజే.రావు, హైదరాబాద్‌లోని ఐఐఐటీ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ఐఐటీ డైరెక్టర్ పీజే. నారాయణ, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కెఎస్.సత్యనారాయణ, జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ టీఎస్.కిషన్‌కుమార్‌రెడ్డి, టాటా ఇనిస్టిట్యూట్ రీసెర్చ్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, యూజీసీ డిప్యూటి సెక్రటరీ లెఫ్ట్‌నెంట్ కమాండర్ వినోద్‌సింగ్‌యాదవ్, ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ కెఎస్. వేణుగోపాల్, ఆర్.ప్రసాద్, భాస్కరరావు, సంజీబ్‌దత్తా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగం, ఉపాధి

- టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం వద్ద గురువారం లెర్నింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ సహకారంతో 24 గ్రామ పంచాయతీలకు చెందిన 90 మందికి ఉచితంగా లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేసినట్లు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన సుమారు 300 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, ప్రతాప్‌రెడ్డి, ఇస్తారి, విజేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, పరమేశ్, తిరుపతిరెడ్డి, రవి, మహేందర్, శివప్రసాద్, రమేశ్, గణేశ్, శ్రీపతి, శేఖర్, శ్రీను, పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


పీజీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): తమ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లడమే లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డెరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. ఇప్పటికే అనేక మంది దేశ, విదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంబీఏ ఎంటెక్ మొదటి సంవత్సరం పీజీ సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో డీన్ అడ్మినిస్ట్రేటివ్ రాజు, సుందర్‌రావు, పవన్ కుమార్, రాజేందర్ రెడ్డి, శ్రీలత, రాజేశ్వరీ, కుమారస్వామి, సురేష్, విజయ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ విభాగం అధ్యక్షుడిని కలిసిన నరేందర్



శంషాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాజేంద్రపాల్ గౌతంను విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, శంషాబాద్‌కు చెందిన జె.నరేందర్ గురువారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించినట్లు నరేందర్ పేర్కొన్నారు.

అనుమతి లేని రిసార్టును సీజ్ చేయాలి

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మండల పరిధిలోని ఈర్లపల్లి రెవెన్యూలో కొనసాగిస్తున్న త్రిపుర రిసార్టును సీజ్ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందించారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న రిసార్టులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీనివాస్, చంద్రశేఖర్, చందు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఆమనగల్లు మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను పిలుపునిచ్చారు. మోదీ పాలనా దక్షతతో 11 ఏళ్లలో దేశం అద్భుత విజయాలు సాధించిందన్నారు. మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీను, వెంకటేశ్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. నాయకులు గోరెటి నరసింహ, భగవాన్‌రెడ్డి, సీతారామారావు, మల్లేశ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఉత్సాహంగా ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు


చెన్నారంలో ట్రాక్టర్స్ రివర్స్ గేర్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ గిరి

యాలాల, జూన్ 12, (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు ఎంతోమంది ట్రాక్టర్ డ్రైవర్లలో ఉత్తేజాన్ని నింపుతాయని ఎస్ఐ గిరి పేర్కొన్నారు. మండలంలోని చెన్నారంలో స్వర్గీయ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పవన్‌రెడ్డి ఏరువాక పౌర్ణమి సందర్భంగా గురువారం ఈ పోటీలు ఏర్పాటు చేయగా ఎస్ఐ ప్రారంభించారు. ఈ పోటీల్లో దాదాపు 75 మంది రైతులు తమ ట్రాక్టర్లతో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన రమేశ్‌కు రూ.4వేలు, ముకుందాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రెండో బహుమతి రూ.2వేలు, తిమ్మాయిపల్లికి చెందిన కిష్టప్పకు మూడో బహుమతి కింద రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, మల్లప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజ్జి మిర్చి పంట పరిశీలన

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాత, పూత లేక బజ్జి మిర్చి పంట వేసి నష్టపోయిన రైతుల పొలాలను ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. చేవెళ్ల మండల పరిధిలోని చన్వల్లి, పామెన గ్రామాల్లో బజ్జి మిర్చి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీర సురేష్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ.. నష్ట కారణాలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. బజ్జి మిర్చి పంట ఏపుగా పెరిగి కాత పూత లేదని పలువురు రైతులు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. చేవెళ్ల ఏవో శంకర్‌లాల్, ఉద్యాన శాఖ అధికారి కీర్తి, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

శామీర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యకోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో విజయకుమారి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, శామీర్‌పేట, లాల్‌గడి మలక్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఎంఈవో కమలాకర్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్కులను అందజేశారు. లాల్‌గడీమలక్‌పేట పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

మూతబడింది!

- తెరుచుకోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల



తెరుచుకోని మర్పల్లి మండలంలోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల

మర్పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు అట్టహాసంగా ప్రారంభమైనా మండలంలోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల తెరుచుకోలేదు. గతంలో ఈ బడిలో 40 మందికిపైగా విద్యార్థులుండగా గతేడాది ఉపాధ్యాయుల బదిలీల్లో ఉన్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లాడు. దీంతో ఇక్కడి విద్యార్థులు సంగారెడ్డి జిల్లాలోని దిగ్వాల్, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో అప్పటినుంచి పాఠశాల మూతపడింది. తిరిగి ఫిబ్రవరిలో ఆ పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని నియమించగా విద్యార్థులు లేకపోవడంతో గ్రామంలోని ఐదుగురు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. కానీ వారు కూడా సరిగా పాఠశాలకు హాజరుకాలేదు. గ్రామంలోని పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుడు హాజరుకాలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలతో నామమాత్రంగా బడిబాట నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పాఠశాల తెరుచుకుంటే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో అంజిలప్పను వివరణ కోరగా పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కూడా నియమించామని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు సైతం పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయుడు విధులకు హాజరుకాని పక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.


దండుమైలారంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సర్కారు బడుల బలోపేతానికి చర్యలు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులకే పంపాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం మండల పరిధిలోని దండుమైలారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తమ పరిధిలోని ఏ పాఠశాలలో అయినా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హీర్యానాయక్, ఇబ్రహీంపట్నం, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు కె.గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు, అదుపులో నిందితుడు

అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్టు

తాండూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలో అంతర్ జిల్లా మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేశారు. నిందితుడు యాలాల మండలం కమల్‌పూర్‌నకు చెందిన ఆటో డ్రైవర్ బోయిని శ్రీకాంత్(24)ను గురువారం తాండూరులో విలియమూన్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీల్లో పట్టుకున్నారు. శ్రీకాంత్ బైక్‌పైరాగా డాక్యుమెంట్లు చూపాలని అడుగగా అతడు బైక్‌ను వదిలి పారిపోతుండగా పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 15మోటారు సైకిళ్లను చోరీచేసి పది బైక్‌లను తాండూరు మండలం బిజ్వారం వాసులకు విక్రయించాడు. నాలుగింటిని తర్వాత తన ఇంటి వద్ద పెట్టాడు. దొంగలించిన మోటార్ సైకిళ్లలో తాండూరు, సైబరాబాద్, అల్లాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. గతంలోనూ యాలాల, కూకట్‌పల్లి, మియాపూర్, సనత్‌నగర్, బంజారా హిల్స్, బాచుపల్లి, చందానగర్, మధాపూర్ ప్రాంతాల్లో 20కేసుల్లో జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోష్‌కుమార్ చెప్పారు. నిందితుడి వద్ద రూ.7.5లక్షల విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ, ఎస్ఐ సాజిద్, క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అంజాద్, శివకుమార్, కానిస్టేబుల్ సాయప్ప, షబీల్ అహ్మద్‌లను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

ఇంటర్‌లో అడ్మిషన్లకు ఇంటింటికీ ప్రిన్సిపాల్

యాచారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ చేరే విద్యార్థులు యాచారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరుతున్నారు. ఆయనతోపాటు లెక్చరర్లు మండలంలోని మాల్, మేడిపల్లి, తమ్మలోనిగూడ, గున్‌గల్, నందివనపర్తి, చౌదర్‌పల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో నాలుగు రోజులుగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి కోరుతున్నారు. కళాశాలలో నాణ్యమైన బోధనతోపాటు అన్ని సౌకర్యాలున్నాయని వివరిస్తున్నారు. ఫీసు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, విద్యార్థుల ప్రతిభ, మార్కులు, వచ్చిన ర్యాంకుల గురించి వివరిస్తున్నారు. కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వంద శాతం ఫలితాలే లక్ష్యంగా బోధన అందిస్తున్నామని ప్రిన్సిపాల్ చెబుతున్నారు.


నందివనపర్తిలో అడ్మిషన్ తీసుకోవాలని విద్యార్థులను కోరుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు


విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

విద్యాభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం షాద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ సంప్రదాయం ప్రకారం పార్థివదేహాలను ఖననం చేస్తున్న శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించి, వసతులను కల్పించాలని కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. షాద్‌నగర్ మినీ స్టేడియం పక్కన 30 ఏళ్ల క్రితం దాతల సహకారంతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ కూలిపోయిందని, సౌకర్యాలు కూడా కొరవడ్డాయని ఆర్యవైశ్య, రెడ్డి, బ్రాహ్మణ, మార్వాడి, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ తదితర సంక్షేమ సంఘాల నాయకులు గురువారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిశారు. సమస్యపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదించి, ప్రహరీతోపాటు సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గందే సురేష్, మలిపెద్ది శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, యంసాని శ్రీనివాస్, ఆగీరు రవి, సారాపు జగదీష్, కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, కోట జనార్దన్, వెంకటేశ్వర్‌రావు, జగదీశ్ కండేల్వాల్, రాధేశ్యాం, కొందూటి రవి పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమానా తప్పదు

మహేశ్వరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తవేస్తే జరిమానా తప్పదని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో కాలనీవాసులకు అవగాహన కల్పించారు. రోడ్లపై చెత్త వేసినపలువురుని గుర్తించి జరిమానా విధించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సుధీర్

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫాం అందిస్తున్నామని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో బాబుసింగ్, ఏఏపీసీ చైర్మన్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు వీరేశం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా అంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. కలెక్టరేట్‌లో దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గన్య వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో వైద్యులు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమాచారం నిమిత్తం 97027 05161 ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, డీబీసీడీవో ఉపేందర్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు..

ప్రకృతి వనాలు ఆహ్లాదానికి దోహదం


కొడంగల్ ప్రకృతి వనంలో షటిల్ ఆడుతున్న తిరుపతిరెడ్డి, నాయకులు

- కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనాలు ఆహ్లాదకర వాతావరణానికి దోహదపడతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని లాహోటీ కాలనీలో రూ.కోటీ 20 లక్షలతో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరామ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వనంలో మొక్కలు నాటి నీరు పోశారు. క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, ఆట వస్తువులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధిలో కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ, హెచ్ఎండీఏ అధికారులు సత్యనారాయణమ్మ, సౌమ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నయీమ్, దాము, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, ఆవుటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కోట్‌పల్లి: విద్యార్థులకు దుస్తులు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు, టీచర్లు

వడివడిగా బడికి

వేసవి సెలవుల అనంతరం బడి తలుపులు తెరుచుకున్నాయి. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయమే ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. విదార్థులకు పుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అలాగే పలు పాఠశాలల్లో కొత్తగా విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరగించారు.



కులకచర్ల: ముజాహిద్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు



ధారూరు ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యార్థులను చేర్పుకుంటున్న ఉపాధ్యాయులు



కొడంగల్ రూరల్: పెద్ద నందిగామలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్సులు, పుస్తకాలు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు



కీసర: నాగారంలో పుస్తకాలందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



తాండూరు: తాండూరు ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న హెచ్ఎం శివకుమార్, తోటి ఉపాధ్యాయులు



యాలాల: పగిడ్యాల్ పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్న విద్యార్థులు



బొంరాస్‌పేట్: కొత్తూర్‌లో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



పరిగిలోని గడ్డమీదిపాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ



పూడూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో సాయిరెడ్డి, పీడీ శ్రీనివాస్



గొట్టిగఖుర్దులో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న మండల విద్యాధికారి దూస రాములు



ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ బాలికల పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం కృష్ణకుమారి



దోమ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీవో గమ్యా



మర్పల్లి: తిమ్మాపూర్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సీఎంతో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

● ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు మండల ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఎవరు మొదట పూర్తిచేసే వారి గృహ ప్రవేశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో నిర్వహిస్తామని, అందుకు ఏర్పాట్లన్నీ తానే చూసుకుంటానని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం వీరశైవ కల్యాణ మండపంలో వివిధ గ్రామాల 624 మంది లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేశారు. త్వరగా ఇల్లు నిర్మించుకున్న వారింటికి సీఎం, స్పీకర్‌లను ఆహ్వానిస్తానని చెప్పారు. ప్రజాసేవే తన జీవితాశయం అన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తాం అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.సుజాత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, రాష్ట్రఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్,ఎస్.రవీందర్‌గౌడ్, ఉత్తంచంద్, సంపత్‌కుమార్, జెర్నె నాగప్ప, హబీబ్‌లాల, శరణుబసప్ప, ఉదయభాస్కర్‌రెడ్డి, జర్నప్ప, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాందాస్, గోపాల్, మేఘనాథ్‌గౌడ్, సాయిలు, జగదీశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్ రెడ్డి, పండరి తదితరులు పాల్గొన్నారు.

రూ.2.21కోట్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

తాండూరు: తాండూరు మునిసిపాలిటీలో రూ.2.21కోట్లతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదర్శనగర్ పాత కుంటలో కాల్వ నిర్మాణం, ఆర్డీవో ఆఫీసు నుంచి రాయల్ కుంట వరకు మురుగు కాలువపనులకు శంకుస్థాపన చేశారు. పీసీసీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలో చేపట్టిన పథకాల తీరుపై వివిధ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు.

పెద్దేముల్: మండల పరిషత్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదే సమయంలో వర్షంరాగా ఇళ్ల మంజూరు వరుణ దేవుడికి కూడా ఇష్టంగా ఉందని, అందుకే వర్షం కురిపించి ఆశీర్వదించాడని చెప్పారు. ఇందిరమ్మ మోడల్ ఇంటితో పట్టణంలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ అంజయ్య, ఎ-బ్లాక్ అధ్యక్షులు నర్సిములు, రవిశంకర్, ఆనంద్‌చారి పాల్గొన్నారు.

కీసర: పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. చీర్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆమె శంకుస్థాపన చేసి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల కృష్ణ, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. అన్నారంలో ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పైలట్ గ్రామం అన్నారంలో నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలన్నారు. ఎంపీవో జైపాల్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ భాస్కర్, గ్రామస్తులు ఉన్నారు.

చౌడాపూర్: ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మందిపాల్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రత్యేకాధికారి ఉపేందర్, ఎంపీడీవో సోమలింగం, ప్యాక్స్ వైస్‌చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, పీఎస్ శివశంకర్, రాజు, కేశవులు పాల్గొన్నారు.



పెద్దేముల్‌లో

క్రైం కార్నర్

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

వికారాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వికారాబాద్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్-సదాశివపేట రోడ్డులో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు 40-45ఏళ్ల వయస్సు ఉంటాడని, చామరంగు, కోల ముఖం, బూడిద రంగు ప్యాంటు, బ్లూషర్ట్ ధరించాడని రైల్వే ఎస్సై తెపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 7702629707/8466938351 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్12(ఆంధ్రజ్యో): తన ఫోన్‌ను తస్కరించి అమ్ముకున్న అల్లుడిని అత్త మందలించడంతో ఆమె హత్య చేసిన అల్లుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట కాలనీలో మంజుల బుజ్జమ్మ(40)ను అల్లుడు శాతోల దొరబాబు(30) హత్య చేశాడు. మృతురాలి కూతురు ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేసి దొరబాబును బుధవారం యంనంపేట్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. 6న బుజ్జమ్మ ఫోన్‌ను దొరబాబు తస్కరించి అమ్ముకొని ఆ డబ్బుతో మద్యం తాగాడు. దీంతో అత్త గొడవకు దిగి తనఫోన్ తెచ్చివ్వాలని ఒత్తిడి తెచ్చింది. 10న బుజ్జమ్మ కూతుళ్లు వేరే గ్రామానికి వెళ్లగా బుధవారం తెల్లవారుజామున ఒంటరిగా ఉన్న అత్త గుడిసెలోకి దొరబాబు వెళ్లి ఆమె గొంతు పిసికి చంపాడు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు

బొంరాస్‌పేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో వ్యక్తికి కోర్టు జైలు శిక్షను విధించినట్లు బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్ రవూఫ్ గురువారం తెలిపారు. మెట్లకుంటలో గత జనవరి 16న రాత్రి ఈడిగి ఆలమ్మకు చెందిన హోటల్‌లో సమ్మగాళ్ల శేఖర్ బీరువాలోని 26 తులాల వెండి పట్టీలు, రూ.6వేల నగదు చోరీ చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి శేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొడంగల్ మున్సిఫ్ కోర్టు జడ్జి శ్రీరామ్ శేఖర్‌కు 6నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న మహిళలు

వికారాబాద్, జూన్ (ఆంధ్రజ్యోతి): యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని యోగ శిక్షకులు నారాయణ రాథోడ్, బాలకృష్ణ అన్నారు. గురువారం వేంకటటేశ్వర ఆలయం ఆవరణలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే అద్భుతమైన ఫలితాలుంటాయని చెప్పారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా యోగ సాధన చేయించారు.

'తాండూర్ డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి'

కొడంగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసును నీరుగార్చి పెత్తందారులకు వత్తాసుపలుకుతున్న తాండూర్ డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. గురువారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డిలకు వినతిపత్రం అందించారు. కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లోని పర్సాపూర్, రేగడిమైలారం గ్రామాల్లో దళితుల భూముల్లో రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

దోమ/బొంరాస్‌పేట్/కొడంగల్ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20లోపు రైతు భరోసా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ప్రభాకర్‌రావు గురువారం పేర్కొన్నారు. కొత్తగా పట్టాపాసు పుస్తకాలు వచ్చిన రైతులు వారు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలతో వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో రైతు భరోసా వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోనవసరం లేదన్నారు. కొత్తగా జూన్ 5 నాటికి పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో పోలప్ప పేర్కొన్నారు. దరఖాస్తులను ఏవోలకు అందజేయాలని తెలిపారు. రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని టేకుల్‌కోడ్ క్లస్టర్ ఏఈవో దేవేందర్ తెలిపారు. రైతు భరోసా అప్లికేషన్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు తీసుకుని సంబంధిత విస్తరణ అధికారికి ఈ నెల 20వ తేదివరకు ఇవ్వాలని తెలిపారు. గతంలో రైతు భరోసా డబ్బులు పడుతున్న రైతులు ఎలాంటి పత్రాలు ఇవాల్సిన అవసరం లేదన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, సదానందం

మోమిన్‌పేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశువైద్యాధికారి సదానందం అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ సరిత, ప్రణీత్, ఎంపీవో యాదగిరి, ఎంఈవో మల్లేశం, వైద్యురాలు గీత, ఎంపీవో శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అలవేలు, మౌనిక, రాఘవేందర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్ టౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడ్చల్ మున్సిపాలిటీ, శ్రీరంగవరం, అత్వెల్లిల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యపై రైతులకు వివరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రైతులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.

కోట్‌పల్లి: భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆర్ఓఆర్ చట్టం తెచ్చిందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలియజేశారు. బార్వాద్ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భాగ్యలక్ష్మి, సిబ్బంది జగదీష్, బల్‌రాజ్, జగదీశ్వర్, నాయకులు నర్సింహారెడ్డి, రాచిరెడ్డి, నర్సిములు, రాంచందర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

కులకచర్ల: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పీరంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం రైతుల భూసమస్యల పరిష్కారానికి భూభారతిని అమలు చేస్తుందన్నారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి,ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

31 పంచాయతీల్లో ముగిసిన ఆడిట్

పూడూరు, జూన్12(ఆంధ్రజ్యోతి):మండలంలో ఉపాధి హామీ పథకం-16వ విడత సామాజిక తనిఖీ ముగిసింది. 31పంచాయతీల్లో జరిగిన పనులకు ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. గురువారం పూడూరు ప్రజావేదికలో వివరాలు వెల్లడించారు. ఆడిట్‌లో రూ.90వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అలాగే రూ.1.2లక్షలు రికవరీ చేయాలని ఆడిట్ నివేదికలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, ఏపీవో రాములు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మండల పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక

దోమ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దోమ మండల పంచాయతీ కార్యదర్శుల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగులయ్య, ఉపాధ్యక్షుడు రవి, సంతోషి, ప్రధాన కార్యదర్శి విజయ్, కోశాధికారి సంజీవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరపతయ్య, పబ్లిసిటీ సెక్రటరీ నరేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

కొడంగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని న్యాయవాదులు బస్వరాజ్, ఆనంద్, వెంకటయ్య అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా కొడంగల్ మున్సిఫ్‌కోర్టు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులను కార్మికులుగా మార్చితే బాలల రక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు.

సంక్షిప్తంగా

● **బషీరాబాద్:** గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీడీవో విజయ్‌కుమార్ గురువారం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా కార్యదర్శులకు సూచనలు చేశారు. ప్రత్యే పరిశుభ్రత చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయించడం, పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏపీవో శారద, ఈసీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● **దోమ:** గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని ఎంపీడీవో గ్యామా అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతీ పంచాయతీలో 40వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

● **తాండూరు:** మూడంతస్తులకు అనుమతులు పొంది ఐదంతస్తులు నిర్మాణం చేయడమే కాకుండా డీజిల్ జనరేటర్‌ను ఏర్పాటు చేయడంతో శబ్ధ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ కౌన్సిలర్ అనురాధ రవికుమార్, కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మెయిన్ రోడ్డువైపు కాకుండా జనావాసుల మధ్య జనరేటర్ ఏర్పాటు చేయొద్దని చెప్పినా వినకుండా భవనఓనర్ జనరేటర్‌ను ఏర్పాటు చేశాడని ఆరోపించారు. శబ్ద, వాయు కాలుష్యం భరించడం లేదని విష వాయువు ఇళ్లల్లో నిండుతోందన్నారు. జనరేటర్‌ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

● **కులకచర్ల:** రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పొలాల దగ్గర ఉన్న ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. కొనుగోళ్లు పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయన్నారు. కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

● **దుద్యాల:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ సహాయం అందిస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని కుదురుమళ్లకు చెందిన అనిల్‌కుమార్‌కు మంజూరైన రూ.1లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక సందడి!

(ఐదో పేజీ తరువాయి)

సంస్థలు నిర్వీర్యంగా మారాయి. పాలకవర్గాలు లేక స్థానిక సంస్థల్లో పాలన ఏ విధంగా కొనసాగుతోందనే విషయమై క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం ఎన్నికలు నిర్వహణకు సన్నద్ధమవుతోంది.

సిద్ధం కావాలంటూ సంకేతాలు

ఎన్నికలకు సిద్ధం కావాలనే సంకేతాలను అధికార పార్టీ తమ శ్రేణులకు కూడా పంపించిన నేపథ్యంలో జూలైలో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పంచాయతీ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? లేక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలా అనేది స్పష్టత రాలేదు. ఎన్నికలు నిర్వహిస్తే కేడర్‌లో నూతనోత్సాహం నెలకొని ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావాలనుకునే వారికి అవకాశం కల్పించినట్లు అవుతుందని అధికార పార్టీ భావిస్తోంది.

సమగ్ర సమాచారం సిద్ధం!

గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమగ్ర వివరాలతో జాబితాలు సిద్ధం చేశారు. ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. గులాబీ, తెలుపు బ్యాలెట్‌పత్రాలు సైతం సిద్ధం చేసుకున్నారు. ఈ వివరాలన్నీ టీ-పోల్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంపీడీవోలకు ఆదేశాలున్నాయి. గ్రామపంచాయతీలో ఎంపిక చేసిన వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల సమాచారం టీ-పోల్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. పోలింగ్ కేంద్రాల పరిధి గ్రామాలు, ఓటర్ల సంఖ్య వివరాలు నమోదు చేస్తారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల సమాచారం క్రోడీకరించనున్నారు. సిద్ధంగా ఉన్న ఉద్యోగుల జాబితాలో ఎవరైనా వేరే ప్రాంతాలకు వెళ్లారా? కొత్త వారెవరైనా వచ్చారా? ఉన్న వారిలో ఎవరైనా ఉద్యోగ విరమణ చేశారా? ఇతర తాజా సమాచారం సేకరించి పోర్టల్‌లో నమోదు చేస్తారు.



వార్డుకో పోలింగ్ కేంద్రం చొప్పున

పంచాయతీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహిస్తారని తెలుస్తోంది. జిల్లాలో 20మండలాల పరిధిలో 594గ్రామ పంచాయతీలు, 5,058వార్డులు ఉన్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితాలు సిద్ధం చేశారు. అలాగే 3,250 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు.మహారాష్ట్ర నుంచి ఇంతకు ముందు వచ్చిన బ్యాలెట్ బాక్సులు 1,250ఉండగా, కర్ణాటకలోని బీదర్ నుంచి 2వేల బాక్సులొచ్చాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రతీ వార్డులో ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఒక వార్డులో 650మంది ఓటర్ల వరకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఒకే వార్డులో 1,300కంటే ఎక్కువ మంది ఓటర్లుంటే మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

కుండపోత వర్షం

కోట్‌పల్లి/ఘట్‌కేసర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):కోట్‌పల్లి మండల గ్రామాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షంకురిసింది. మోత్కుపల్లి ఉంచి వికారాబాద్ మార్గంలో మోత్కుపల్లి వాగు పొంగిపొర్లి రాకపోకలకు కాసేపు ఇబ్బంది ఎదురైంది. ఘట్‌కేసర్‌లో మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. రెండుదఫాలు వర్షం కురువడంతో వాతావరణం చల్లబడి జనం ఉపశమనం పొందారు.



పొంగిపొర్లుతున్న మోత్కుపల్లి వాగు